నమస్తే తెలంగాణ | శేరిలింగంపల్లి | కూకట్‌పల్లి | కుత్బుల్లాపూర్ | మంగళవారం 24 జూన్ 2025 | TUESDAY, JUNE 24, 2025 | III

## విద్యుత్ ఉండని ప్రాంతాలు

కేపీహెచ్‌బీ కాలనీ : మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఆయా సెక్షన్ల ఏఈలు.. వాణి, చైతన్య, భీమ లింగప్ప తెలిపారు. కూకట్‌పల్లి సెక్షన్ పరిధిలో.. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు శుభోదయం కాలనీ, వివేకానంద నగర్, ఏఎస్ రాజు నగర్ కాలనీలలో.. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈనాడు కాలనీ, సంగీత నగర్, రావుస్ స్కూల్ పరిసర ప్రాంతాల్లో..

**వసంత నగర్ సెక్షన్ పరిధిలో..**

ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు సర్దార్ పటేల్ నగర్, సాయి నగర్, హైదర్ నగర్ మెయిన్ రోడ్డు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వెంకటరమణ కాలనీ పరిసర ప్రాంతాల్లో..


**బాలాజీ నగర్ సెక్షన్ పరిధిలో..**

ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పీపుల్స్ వైద్యశాల, వివేక్ నగర్, ప్రతిభ డిగ్రీ కాలేజ్, బాలాజీ నగర్ కమ్యూనిటీ హాల్, న్యూ బాలాజీ నగర్, హనుమాన్ టెంపుల్, వైఎస్ఆర్ విగ్రహం, యోగ్యత అపార్ట్‌మెంట్ పరిసరాల్లో.. మధ్యాహ్నం 2 నుంచి సా. 5 గంటల వరకు కూకట్‌పల్లి పీఎస్ , వివేక్ నగర్, పీపుల్స్ వైద్యశాల, ప్రతిభ డిగ్రీ కళాశాల, వైఎస్ఆర్ విగ్రహం, చైతన్య కళాశాల, బాలాజీ నగర్ దర్గా ఏరియా, శాంతి నిలయం పరిసర ప్రాంతాలలో సరఫరా నిలిచిపోతుందని తెలిపారు.

## కూరగాయల ధరలు

కేపీహెచ్‌బీ కాలనీ : కూకట్‌పల్లి (కేపీహెచ్‌బీ కాలనీ) రైతుబజార్‌లో సోమవారం కూరగాయల ధరలు (కేజీ-రూపాయలు). టమాట 21, వంకాయ 23, బెండ 45, పచ్చిమిర్చి 45, బజ్జి మిర్చి 18, కాకర 38, బీర 31, క్యాబేజీ 19, ఫ్రెంచ్ బీన్స్ 85, క్యారెట్ 40, కాలీఫ్లవర్ 30, దొండ 28, చిక్కుడు 55, గోరుచిక్కుడు 35, బీట్‌రూట్ 25, క్యాప్సికం 67, ఆలు 25, కీరు 23, దోస 18, సోర 15, పొట్లకాయ 23, కంద 45, ఉల్లిపోరక 45, ఉల్లిగడ్డ 24, మామిడి కాయ(1) 15 నుంచి 20, అరటికాయ 9 నుంచి 11, చామ 28, ముల్లంగి (1) 4 నుంచి 5, మొరంగడ్డ 30, గుమ్మడి 30, నిమ్మకాయలు(12) 24 నుంచి 30, మునగ (1) 8 నుంచి 18, పొప్పడి 40, పుట్టగొడుగులు 40, ఎండుమిర్చి 160, అల్లం 80, వెల్లుల్లి 140, చింత పండు 160, కరివేపాకు 60గా ఉన్నాయి. ధరలు నేటి ఉదయం 9.30 గంటల వరకు అమలులో ఉంటాయని ఎస్టేట్ ఆఫీసర్ సుధాకర్ తెలిపారు.

# కొత్తచెరువును పునరుద్ధరించాలి



ముదిరాజ్ కులస్తులు, జిల్లా మత్స్య సహకార సంఘం ప్రతినిధులతో కొత్తకుంట చెరువు వద్ద చైర్మన్ మన్నె రాజు ముదిరాజ్



చింతల్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ శ్రేణులు

దుండిగల్, జూన్ 23 : కుత్బుల్లాపూర్ నియోజక వర్గం, గాజులరామారం సర్కిల్, సూరారం డివిజన్ పరిధి, శ్రీకృష్ణ నగర్‌లోని కొత్తకుంట (చెరువు)ను పునరుద్ధరించాలని మేడ్చల్ జిల్లా మత్స్య సహకార సంఘం చైర్మన్ మన్నె రాజు ముదిరాజ్ అన్నారు. ఆదివారం ఆయన మత్స్యసహకార సంఘం ప్రతినిధులు, ముదిరాజ్ కులస్తులతో కలిసి చెరువును సందర్శించారు. గాజులరామారం రెవెన్యూ పరిధి, సర్వే నం.23లోని కొత్తకుంట ఒకప్పుడు 10 ఎకరాల్లో ఉండేదన్నారు. 2014కు ముందు వేమారెడ్డి ఐదెకరాలు కబ్జా చేసినట్లు ఆరోపించారు. మరికొందరు ఇదే స్థలంలో ఇండ్లు నిర్మించగా ప్రస్తుతం రెండెకరాలు మాత్రమే కుంట ఉందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో వేమారెడ్డి ఉన్న రెండు ఎకరాల స్థలాల్లో మట్టిని నింపి కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తుండడం దుర్మార్గమన్నారు. ఎవరైనా ఈ విషయమై ప్రశ్నిస్తే ప్రభుత్వంలోని పెద్ద నాయకులతో సంబంధాలు ఉన్నాయని భయభ్రాంతులకు గురి చేస్తున్నాడని ఆరోపించారు. మత్స్యకారులకు చేపలు పెంచుకునేలా ఉండాల్సిన చెరువును ఆక్రమిస్తున్న కబ్జాదారులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికే సూరారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు మన్నె రాజు వెల్లడించారు. వేమారెడ్డిపై చర్యలు తీసుకోవడంతో పాటు చెరువులో నింపిన మట్టిని తొలగించి, పరిసర ప్రాంతాల ప్రజల సౌకర్యార్థం కొత్తకుంట చెరువును సుందరంగా తీర్చిదిద్దాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మత్స్యకారుల అందరితో కలిసి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో గాజులరామారం ఫిషరీస్ కో - ఆపరేటివ్ చైర్మన్ యాదగిరి ముదిరాజ్, జీతయ్య, దొడ్ల ఆంజనేయులు, వాసుదేవ రావు, సూరారం ఫిషరీస్ కో -ఆపరేటివ్ చైర్మన్ మారి గణేశ్, భరత్, చిత్తయ్య, శివరాజ్ భాస్కర్, సురేశ్ చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

**ఎమ్మెల్యే వివేకానంద్‌ను విమర్శిస్తే ఊరుకోం..**

కుత్బుల్లాపూర్ : హైడ్రా పేరుతో కబ్జాలను అరికాడుతున్నామని చెప్పుకుంటున్న కాంగ్రెస్ నాయకులు మూటలు పోగేసుకుంటున్నారని బీఆర్ఎస్ శ్రేణులు ధ్వజమెత్తారు. కుత్బుల్లాపూర్‌లో కాంగ్రెస్ నాయకుల నాటకాలను బట్టబయలు చేస్తామని హెచ్చరించారు. నిరాధార ఆరోపణలతో కుత్బుల్లాపూర్ సంక్షేమ ప్రదాత ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్‌పై కొందరు ఇష్టం వచ్చినట్లు మాట్లాడాన్ని ఖండిస్తూ సోమవారం చింతల్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో పత్రికా ప్రకటన సమావేశానికి జగద్గిరిగుట్ట డివిజన్ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, మహిళా నాయకురాలు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ.. రెండు రోజులుగా కొందరు కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే వివేకానంద్‌పై ఇష్టం వచ్చినట్లు మాట్లాడడం హేయమైన చర్య అని ఖండించారు. జగద్గిరిగుట్టలో ఒక నిర్మాణానికి జనవరి 18న హైడ్రా నోటీసులు ఇస్తే, జనవరి 20న హన్మంత్‌రెడ్డి అదే నిర్మాణాన్ని ప్రారంభించారని దీనికి సమాధానం చెప్పాలన్నారు. వేంకటేశ్వర స్వామి గుడి వద్ద రూ.లక్ష తీసుకున్నది నువ్వు కాదా ..? మా వద్ద ఎవిడెన్స్ ఉన్నాయని, త్వరలోనే బయటపెడతామన్నారు. చెరువుల కబ్జాలకు పాల్పడుతూ కబ్జాల కాలనీకి సోనియమ్మ పేరుపెట్టడం అనేది చూస్తుంటే దొంగే..దొంగ దొంగ అన్నట్టుగా ఉన్నదని ఎద్దేవా చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు రుద్రఅశోక్, వేణుయాదవ్, బీఎస్ఆర్ నాని, అజమ్, త్రివేణి, మనోజ్, ఖయుం, సంతోష్, మధు పాల్గొన్నారు.

## కైసర్‌నగర్ నుంచి బాలానగర్ వరకు..



ఆర్టీసీ బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద

దుండిగల్, జూన్ 23 : కుత్బుల్లాపూర్ నియోజక వర్గం, గాజుల రామారం (సర్కిల్) డివిజన్ పరిధి, కైసర్ నగర్‌లోని డబుల్ బెడ్ రూం ఇండ్ల సముదాయం నుంచి బాలానగర్ వరకు నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్సు సర్వీసును బీఆర్ఎస్ విప్, ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ సోమవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధికి దోహదం, ప్రగతిరథ చక్రమని, పేదలు అధికంగా నివసించే డబుల్ బెడ్ రూం ఇండ్ల సముదాయం నుంచి నగరంలోని వివిధ ప్రాంతాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించడం సంతోషంగా ఉందన్నారు. ఉదయం 7 గంటలకు, 8:30 గంటలకు తిరిగి సాయంత్రం 4 , 5 గంటలకు బయల్దేరి వెళ్లే ఈ ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని డబుల్ బెడ్ రూం ఇండ్ల వాసులు, సమీప కాలనీల వాసులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం కొద్ది దూరం ఆర్టీసీ బస్సులో ఎమ్మెల్యే ప్రయాణించారు. కార్యక్రమంలో 2 బీహెచ్‌కే డిగ్నిటీ హౌసింగ్ ఫ్లాట్ ఓనర్స్ కో -ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షులు సాధుల వేణు, సలహాదారులు సాజిద్, ఖాసీం, ఉపాధ్యక్షులు ఎండీ అతిక్ రెహమాన్, ప్రధాన కార్యదర్శి ఎస్.కె.వలి, కోశాధికారి బింగి యాదగిరి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు విజయ్ రాంరెడ్డి, సీనియర్ నాయకులు కస్తూరి బాల్‌రాజ్, అడ్వకేట్ కమలాకర్, నవాబ్ భాయ్, తెలంగాణ సాయి, సాయి బాబా, చెట్ల వెంకటేశ్, చిన్నా చౌదరి, బాబీ చౌదరి, వాహిద్, గోవర్ధన్ రెడ్డి, శివా నాయక్, ఆసిఫ్, చంద్ర గౌడ్, ప్రసాద్, జునైద్, మహిళా అధ్యక్షురాలు సంధ్యా రెడ్డి, నాయకురాలు మామి పాల్గొన్నారు.



## బీమా సదుపాయం కల్పించేందుకు కృషి

బాలానగర్ : భవన నిర్మాణ కార్మికులు, క్యాబ్ డ్రైవర్స్, స్కూల్ వ్యాన్ డ్రైవర్లకు ప్రమాద, ఆరోగ్య బీమా సదుపాయం కల్పించేందుకు కృషి చేస్తానని ఓల్డ్ బోయిన్‌పల్లి కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ అన్నారు. సోమవారం వారు ఏర్పాటు చేసిన కార్యక్రమానికి విచ్చేసి ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోతున్న నేపథ్యంలో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. క్యాబ్, స్కూల్ వ్యాన్ డ్రైవర్స్‌కు ఆరోగ్య బీమా చేయించి సహకారం అందిస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో గోపాల్ నాయక్, వెంకటేశ్ నాయక్, రవి నాయక్, రాములు నాయక్, గోపాల్ నాయక్, రాజు నాయక్, భాస్కర్ నాయక్ పాల్గొన్నారు.

## ఉచిత శిక్షణ.. ఉపాధి అవకాశాలు

మియాపూర్ : ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని దుర్గాబాయి మహిళ ప్రాంగణంలో యువతులకు ఉచిత నైపుణ్య శిక్షణ ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్టు ప్రాంగణం జిల్లా మేనేజర్ సోమవారం తెలిపారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, బీటెక్, పీజీ చదివిన నిరుద్యోగ మహిళలకు ఆఫీస్ ఎగ్జిక్యూటివ్, డిజిటల్ మార్కెటింగ్, ఫ్రంట్ ఆఫీస్ ఎగ్జిక్యూటివ్ ,సేల్స్ అసోసియేట్, డేటా ఎంట్రీ ఆపరేటర్ , సెక్యూరిటీ సూపర్వైజర్ ,బ్యూటీషియన్, ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సుల్లో ఎల్‌సీఎఫ్ సౌజన్యంతో ఉచితంగా నైపుణ్య శిక్షణ అందించి ఉపాధి అవకాశాలను కల్పిస్తామని తెలిపారు. ఈనె ల 26 లోగా కోర్సులకు దరఖాస్తు చేసుకోవాలని, వివరాలు దరఖాస్తు ప్రక్రియ నిమిత్తం పైప్‌లైన్ రోడ్డులో ఉన్న మహిళా ప్రాంగణాన్ని సందర్శించాలని తెలిపారు. వివరాలకు 7660022508,8179416784 నంబర్లలో సంప్రదించాలని జిల్లా మేనేజర్ పేర్కొన్నారు.



## సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం

కేపీహెచ్‌బీ కాలనీ : సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరమని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన కే సత్యవతి (భర్త శ్రీనివాస్)కి రూ.రెండు లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కును పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కష్టకాలంలో సీఎం రిలీఫ్ ఫండ్ ఆదుకుంటుందని, అర్హులందరూ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## విద్యార్థులు రక్తదానం..అభినందనీయం




రక్తదానం చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్ అందిస్తున్న వైస్ చాన్సలర్ కిషన్‌కుమార్ రెడ్డి

కేపీహెచ్‌బీ కాలనీ : విద్యార్థులు రక్తదానం చేయడం అభినందనీయమని జేఎన్టీయూహెచ్ వైస్‌చాన్సలర్ టి.కిషన్‌కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం యూనివర్సిటీలోని ఎస్‌బీఐ 70వ స్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని.. యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ సెల్, నిలోఫర్ వైద్యశాల బ్లడ్ సెంటర్ ఆధ్వర్యంలో యూనివర్సిటీ హెల్త్‌సెంటర్లో రక్తదాన శిబిరాన్ని వైస్ చాన్సలర్, రిజిస్ట్రార్ వెంకటేశ్వర్ రావు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ.. రక్తదానం అనేది గొప్ప మానవత సేవ అని, విద్యార్థులు రక్తదానం చేయడంలో ముందుండాలని సూచించారు. శిబిరంలో 150 మందికి పైగా విద్యార్థులు, అధ్యాపకులు, రక్తదానం చేయగా.. వారికి ఎన్ఎస్ఎస్ విభాగం నుంచి ప్రమాణ పత్రం, ఎస్‌బీఐ నుంచి రూ.500 గిఫ్ట్‌వోచర్ అందజేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో - ఆర్డినేటర్ శోభారాణి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## పరామర్శ

అల్లాపూర్ : అల్లాపూర్ డివిజన్ పరిధిలోని తులసి నగర్‌కు చెందిన బీఆర్ఎస్ అధ్యక్షుడు శ్రీనివాస్ కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న కార్పొరేటర్ సబిహా బేగం సోమవారం శ్రీనివాస్ ఇంటికి వెళ్లి పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పిన కార్పొరేటర్ శ్రీనివాస్ త్వరగా కోరుకుంటాడని ఆకాంక్షించారు.

## ప్రజావాణిలో..సమస్యలపై ఫిర్యాదులు



సర్కిల్ కార్యాలయంలో సమస్యలను స్వీకరిస్తున్న డీసీ నరసింహ

కుత్బుల్లాపూర్, జూన్ 23 : కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు పలు సమస్యలపై ఫిర్యాదు చేశారు. ప్రధానంగా అక్రమ నిర్మాణాలు, ప్రభుత్వ స్థలాల కబ్జాలపై అత్యధికంగా ఫిర్యాదులు అందాయి. శాశ్వత పరిష్కారం చూపకుండా నోటీసులు ఇచ్చామంటూ అధికారులు పక్కదోవ పట్టిస్తున్నారని ఫిర్యాదుదారులు వాపోతున్నారు. ఫిర్యాదును పరిశీలించి చర్యలు తీసుకోవాలని కిందిస్థాయి అధికారులకు సూచించారు.

## వ్యక్తి ఆత్మహత్య

జగద్గిరిగుట్ట, జూన్ 23: మద్యానికి బానిసైన వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జగద్గిరిగుట్ట పోలీసుల వివరాల మేరకు .. సుమిత్రా నగర్‌లో ఆటో డ్రైవర్ నర్సింగరావు (45) కుటుంబంతో నివాసం ఉంటాడు. కొంతకాలంగా తాగుడుకు బానిస కావడంతో భార్యతో కుటుంబ కలహాలున్నాయి. ఈ నేపథ్యంలో సోమవారం జగద్గిరిగుట్ట హనుమాన్ నగర్ లోని తమ్ముడు సంతోష్ ఇంటికి వచ్చాడు. ఇంట్లోని వారు బయటకు వెళ్లగా మధ్యాహ్నం తాళం పగులగొట్టి నర్సింగరావు ఇంట్లోకి వెళ్లి ఉరి వేసుకున్నాడు. స్థానికులు గమనించేసరికే చనిపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని గాంధీ దవాఖానకు తరలించి కేసు నమోదు చేశారు

## భర్తతో గొడవపడి ..

దుండిగల్ : భర్తతో గొడవపడి ఓ గృహిణి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సూరారం పీఎస్ పరిధిలో చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్‌కు చెందిన సునీల్ పాండే, సుధా పాండే (29)కు 12 ఏండ్ల క్రితం వివాహమైంది. వీరికి కూతురు, కొడుకు ఉన్నారు. 9 నెలల క్రితం ఉపాధి కోసం నగరానికి వచ్చి సూరారం డివిజన్ పరిధిలోని రాజీవ్‌గాంధీ నగర్‌లోని ఓ ఇంటిని అద్దెకు తీసుకున్నారు. సునీల్ పాండే డీసీఎం డ్రైవర్‌గా పనిచేస్తుండగా సుధా పాండే గృహిణి. చిన్న చిన్న విషయాల్లో తరచూ భార్తతో గొడవపడే సుధా పాండే సోమవారం ఉదయం సునీల్ ఇంటి యజమానితో బయటకు వెళ్లగా ఫోన్ చేసిన సుధా పాండే మళ్లీ గొడవపడింది. తాను 15 నిమిషాల్లో వస్తానని చెప్పినప్పటికీ శాంతించని సుధా ఇంట్లోని సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఇంటికి వచ్చిన సునీల్ భార్య ఉరికి వేలాడుతూ కనిపించడంతో ఆందోళనకు గురై కిందికి దింపి చూడగా అప్పటికే ఆమె మరణించింది. దీంతో సునీల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ వైద్యశాలకు తరలించారు. కేసు దర్యాప్తులో ఉన్నది.

# ప్రశాంతంగా హౌసింగ్ బోర్డ్ స్థలాల వేలం

కేపీహెచ్‌బీ కాలనీ, జూన్ 23: రాష్ట్ర హౌసింగ్ బోర్డ్ నార్త్ డివిజన్ పరిధిలో.. 22 హౌసింగ్ బోర్డ్ స్థలాల అమ్మకానికి నిర్వహించిన వేలంపాట ప్రశాంతంగా ముగియగా.. రూ. 64 కోట్లు రాష్ట్ర ఖజానాకు చేరాయి. సోమవారం కేపీహెచ్‌బీ కాలనీ మొదటి రోడ్డు లోని హౌసింగ్ బోర్డ్ ఫంక్షన్ హాల్‌లో ఎస్టేట్ ఆఫీసర్ విమల, పీఆర్వో వాసు, డివిజన్ ఈఈ అంకమరావు పాట నిర్వహించారు. ప్రక్రియలో 22 ప్లాట్లను విక్రయించేందుకు రాష్ట్ర హౌసింగ్ బోర్డ్ కార్యాలయం నుంచి ఏర్పాట్లు చేయగా.. చింతల్‌లోని 10 హౌసింగ్ బోర్డు ప్లాట్లకు వేలంపాట నిర్వహించగా.. కేవలం 3 ప్లాట్లు కొనుగోలు చేశారు. అత్యధికంగా గజం ధర రూ.1.14 లక్షల పలికింది. గచ్చిబౌలిలో 4 ప్లాట్లకు పాట నిర్వహించగా.. 4 ప్లాట్లను కొనుగోలు చేశారు. అత్యధికంగా గజం ధర రూ.2.22 లక్షలు పలికింది. నిజాంపేట బాచుపల్లిలో ఎనిమిది ప్లాట్లను విక్రయానికి పెట్టగా.. 4 ప్లాట్లను కొనుగోలు చేశారు. గచ్చిబౌలిలో 3721.0 స్క్వేర్ యాడ్స్, చింతల్‌లో 799.98 స్క్వేర్ యాడ్స్, నిజాంపేటలో 1653.72 స్క్వేర్ ఫీట్ల స్థలాన్ని విక్రయించగా... మొత్తం రూ. 64,37,53,640 (రూ.64.37 కోట్లు) రాష్ట్ర ఖజానాకు చేరాయి.




వేలంపాటలో ఎస్టేట్ ఆఫీసర్ విమల, పీఆర్వో వాసు, ఈఈ అంకమరావు



మియాపూర్ : మున్నూరు కాపు సంఘం మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా హైదర్ నగర్ డివిజన్‌కు చెందిన పోతుల రాజేందర్ పటేల్ నియామకం అయ్యారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య చేతుల మీదుగా నియామక పత్రం సోమవారం అందుకున్నారు. సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని రాజేందర్ పేర్కొన్నారు.

# మెడికవర్‌లో రోబోటిక్ సర్జరీ

కొండాపూర్, జూన్ 23: హైటెక్ సిటీలోని మెడికవర్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ వైద్యులు రోబోటిక్ స్కార్లెస్ థైరాయిడెక్టమీ సర్జరీని విజయవంతంగా పూర్తిచేశారు. భారతదేశంలోనే మొదటి సారిగా రోబోటిక్ సర్జరీని విజయవంతంగా పూర్తి చేసినట్లు మెడికవర్ సీనియర్ రోబోటిక్ సర్జికల్ ఆంకాలజిస్ట్, క్యాన్సర్ సర్జన్ డాక్టర్ అజయ్ వరుణ్ రెడ్డి అన్నారు. సోమవారం హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శస్త్రచికిత్సకి సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. సుడాన్ దేశానికి చెందిన శర్ఫీఫ్ అబ్దుల్లా (50).. రోబోటిక్ స్కార్లెస్ థైరాయిడ్ ఆపరేషన్ కోసం మెడికవర్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌కు వచ్చారు. అతనికి కాన్సర్ సర్జన్ డా.అజయ్ వరుణ్ రెడ్డి ఆధ్వర్యంలో ఆర్ఏబీఐటీ పద్ధతిలో ఆపరేషన్ చేసి, 48 గంటల్లోనే డిశ్చార్జ్ చేశారు. ఇలాంటి ఆపరేషన్ చాలా అరుదుగా జరుగుతుందని, భారతదేశంలో కేవలం నాలుగైదు ఆస్పత్రులకు మాత్రమే దీనికి కావాల్సిన అధునాతన టెక్నాలజీ, నిపుణులైన సర్జన్లు ఉన్నారని డాక్టర్ అజయ్ వరుణ్ రెడ్డి తెలిపారు. సాధారణ థైరాయిడ్ ఆపరేషన్‌కి బదులుగా, మెడ మీద కోత పెట్టకుండా.. చేతి కింద (చంక), ఛాతీ పైభాగంలో దాచి ఉంచే చిన్న కోత ద్వారా థైరాయిడ్ గ్రంథిని చేరుకుంటారని, ఈ రోబోటిక్ శస్త్ర చికిత్సతో రోగులు త్వరగా కోలుకుంటారన్నారు. ఈ చికిత్స అనంతరం ఆపరేషన్ చేసిన ప్రాంతంలో మచ్చకూడా పడదన్నారు. ఇది యువకులకు, ఉద్యోగులకు, అందాన్ని కోరుకునే వారికి చాలా ప్రయోజనకరంగా ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో మెడికవర్ డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.




వివరాలు వెల్లడిస్తున్న మెడికవర్ వైద్యులు

## అందమైన చేతిరాత.. మెరుగైన ఆత్మవిశ్వాసం



జగద్గిరిగుట్ట : స్పష్టమైన చేతిరాత ఆత్మ విశ్వాసం, వ్యక్తిత్వ వికాసాన్ని పెంచుతుందని ఉపాధ్యాయులు అన్నారు. జగద్గిరిగుట్ట హైస్కూల్‌లో సోమవారం జితేందర్ హ్యాండ్ రైటింగ్ అకాడమీ ఆధ్వర్యంలో ఉచితశిక్షణ ప్రారంభించారు. వారం రోజుల పాటు జరిగే శిక్షణలో క్యాలిగ్రఫీ టెక్నిక్ నేర్చుకొంటే పరీక్షల్లో మెరుగైన ఫలితాలు పొందవచ్చని సూచించారు. కార్యక్రమంలో జితేందర్ అకాడమీ డైరెక్టర్ వంపు మల్లేశ్, హెచ్ఎం సుభాష్ చంద్రబోస్, రత్నం, నరేందర్ రెడ్డి, త్రివేణి పాల్గొన్నారు.




మియాపూర్ : అమెరికాలోని న్యూజెర్సీ, విలింగ్ బోరోలో త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి మంగళా శాసనములతో నూతన ఆశ్రమాన్ని ప్రారంభించిన సందర్భంగా నిర్వహించిన సేవా కాలం, తీర్థ గోష్ఠి అనంతరం యజ్ఞం నిర్వహించారు. కార్యక్రమంలో వివేకానంద నగర్ కార్పొరేటర్ మాధవరం రోజా దేవి, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు సోమవారం పాల్గొన్నారు.

# ట్రాక్టర్ దొంగిలించి.. పట్టుబడిన పాత నేరస్తుడు

దుండిగల్, జూన్ 23 : హత్య కేసులో శిక్షణ అనుభవిస్తూ పెరోల్‌పై బయటికి వచ్చిన ఓ నిందితుడు వరుస దొంగతనాలకు పాల్పడుతూ పోలీసులకు పట్టు పడ్డాడు. ఈ ఘటన దుండిగల్ పీఎస్ పరిధిలో చోటుచేసుకున్నది. ఇందుకు సంబంధించిన వివరాలను మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి పీఎస్ ఆవరణలో సమావేశంలో వెల్లడించారు. డీసీపీ కథనం ప్రకారం.. మెదక్ జిల్లా, శంకరంపేట మండలం, మక్త లక్ష్మాపూర్‌కు చెందిన గొండ్ల రాములు, 2016లో జరిగిన ఓ హత్య కేసులో జైలుశిక్ష అనుభవిస్తున్నాడు. గత నెల 26న బెయిల్‌పై విడుదలై దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని మల్లంపేటలోని తన భార్య వద్దకు వచ్చి ఉంటున్నాడు. నేరమే ప్రవృత్తిగా ఎంచుకున్న రాములు ఇటీవల బౌరంపేట్‌లో ఓ ద్విచక్ర వాహనాన్ని దొంగిలించగా, ఈనెల 22న సాయంత్రం డి.పోచంపల్లిలోని ఇండ్లలో ట్రాక్టర్‌ను దొంగలిస్తూ పోలీసులకు పట్టుబడ్డాడు. విచారణలో నేరం అంగీకరించడంతో అతడి నుంచి ద్విచక్ర వాహనం, ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్న పోలీసులు తిరిగి సోమవారం జైలుకు పంపించారు. పెరోల్ పై వచ్చి మళ్లీ నేరాలకు పాల్పడినందున నిందితుడి పెరోల్ రద్దు చేస్తున్నట్లు డీసీపీ వెల్లడించారు. సమావేశంలో మేడ్చల్ ఏసీపీ శంకర్ రెడ్డి , సీఐ సతీశ్, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ సతీశ్ పాల్గొన్నారు